క్లుప్తంగా

నేడు ఈ-ఆటోలు ప్రారంభం



నందిగామ: క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా నందిగామ మున్సిపాలిటీ పరిధిలో కూడా ఎలక్ట్రిక్ ఆటోలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆటోల ద్వారా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరిస్తారు. నందిగామ మున్సిపాలిటీకి వచ్చిన ఎలక్ట్రిక్ ఆటోలను బుధవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, చైర్ పర్సన్ మండల వర లక్ష్మి ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా రోశయ్య జయంతి

జగ్గయ్యపేటఅర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు పట్టణంలో వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాళులర్పించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పట్టణ, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్లు తుమ్మెపల్లి నరేంద్ర, కన్నమాల శామ్యూల్, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు చారుగుండ్ల కొండ, గోగుల వెంకయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు జరపాలి



వత్సవాయి: ప్రభుత్వ నిబంధలనల ప్రకారం విత్తనాల అమ్మకాలు జరపాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఐకే శ్రీనివాస్ సూచించారు. వత్సవాయిలోని విత్తనాల షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. షాపులలో ఉన్న సరుకు వివరాలను నమోదు చేసుకున్నారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు విధిగా రశీదులు అందించాలన్నారు. నాసిరకం విత్తనాలు అమ్మినట్లు తేలితే షాపుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి వి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సుపరిపాలనకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ప్రజలు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



దాచవరం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని దాచవరం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తేదీ క్యాలెండర్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు, విద్యార్థులు, యువత, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయటమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రత్నప్రసాద్, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, తోట హరీష్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ప్రవళిక మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

మందా కృష్ణమాదిగ

జగ్గయ్యపేటఅర్బన్: వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలో ఇటీవల అనుమానాస్పదంగా మృతిచెందిన తుంగ ప్రవళిక మృతిపై గ్రామస్తులతో చర్చించి రీపోస్టుమార్టం, సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. పేటలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించని పక్షంలో ఈనెల 16న వత్సవాయి పోలీస్ స్టేషన్ ముందు దర్నా చేస్తామని చెప్పారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ అభిమతం

- నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పండుగలా జగనన్న సురక్ష కార్యక్రమం
- సర్టిఫికెట్‌లు అందజేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు



పెనుగంచిప్రోలులో ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ప్రభుత్వవిప్ ఉదయభాను, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనుగంచిప్రోలు: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ అభిమతమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అధ్యక్షతన పెనుగంచిప్రోలు-1,2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 687 ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. తొలుత సర్పంచ్ పద్మకుమారితో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్ గ్రామంలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.60 లక్షలు, విద్యుత్ స్తంభాలు, పార్క్ నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనిగండ్లపాడులో...

మండలంలోని అనిగండ్లపాడు-1 సచివాలయ పరిధిలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను లబ్ధిదారులకు 176 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు జాన్‌మియా, కొత్తపల్లి పెంటయ్య, నాయకులు వూట్ల లక్ష్మయ్య, దోసపాటి దానయ్య, కనకపూడి భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేకాధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలను ప్రభుత్వం చేపట్టిన 11 రకాల సర్వీసులను 24 గంటల్లోనే అందిస్తుందన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, హౌస్‌హోల్డ్, పట్టాదార్ పాస్‌పుస్తకం, కౌలు రైతు కార్డులను తక్షణమే అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలో 213 మందికి కుల, 88 మందికి ఆదాయ సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ పాతకోటి త్రివేణి, కార్యదర్శి సుబ్బారావు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గండ్రాయి గ్రామంలోని సచివాలయం-1లో జగనన్న సురక్ష క్యాంపులో 212 ప్రభుత్వ సేవలకు సంబంధించిన సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి, కార్యదర్శి జగ్గయ్య పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఉచితంగా ధ్రువపత్రాలు

జగ్గయ్యపేటఅర్బన్: పజలకు అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటి వద్దకే అందిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ఉన్న 2 వ సచివాలయం, నాగమయ్య బజారులో సీఆర్పీ బిల్డింగ్‌లోని 10 వ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. మున్సిపల్ అధికారులు, గృహ సారధులు, నోడల్ అధికారులు, సచివాలయం పరిధిలోని పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే అధికారులు

వీరులపాడు: గత ప్రభుత్వాల హయాంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు అధికారుల చుట్టూ తిరిగేవారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దాపురం, దొడ్డదేవరపాడు గ్రామ సచివాలయాల్లో అధికారులు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వాధికారులే గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు క్యాంపులు నిర్వహించటం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఎంపీడీవో అరుంధతీ దేవి, తహసీల్దార్ ఆశయ్య నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో డీటీ రిబ్కా రాణి గ్రామస్తులకు సర్టిఫికెట్లను అందజేశారు.

1819 సర్టిఫికెట్లు అందజేత

నందిగామ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అధికారులు 1819 సర్టిఫికెట్లను అందజేశారు. పట్టణంలోని రెండవ సచివాలయ పరిధిలో 524, మండలంలోని రామిరెడ్డిపల్లిలో 398, అంబారుపేటలో 897 సర్టిఫికెట్లను అందజేశారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

చిట్టేల/దబ్బాకుపల్లి(వత్సవాయి): ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సమస్యల పరిష్కారానికి చక్కటి మార్గమని జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చిట్టేల, దబ్బాకుపల్లి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిట్టేల గ్రామంలో 1367, దబ్బాకుపల్లిలో 1149 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాల కోటేశ్వరరావు, ఎంపీటీసీ దామాల తేజశ్రీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సయ్యద్‌బాబు, ఏఎంసీ డైరెక్టర్ పండగ శ్రీను, తహసీల్దార్ వైకుంఠరావు, ఎంపీడీవో చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్న సురక్షా శిబిరాలు

కంచికచర్ల: మీ ఇంటి తలుపు తట్టి సమస్యలు అడిగి తెలుసుకుని ఎటువంటి సర్వీస్ ఫీజు లేకుండా సర్టిఫికెట్లను జారీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని గండేపల్లి, కునికెనపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభలు జరిగాయి. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకునే విషయంలో ఎవరూ మిగిలిపోకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే సీఎం ఆకాంక్ష అన్నారు.

బెస్ట్ వలంటీర్‌కు నగదు బహుమతులు

గండేపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఇచ్చిన టార్గెట్ ప్రకారం సమర్థంగా పూర్తిచేసిన వలంటీర్ ఈదర విజయకుమార్‌కు సర్పంచి బి.రవికుమార్ నగదు బహుమతిని ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బెల్లం కొండ సుబ్బారావు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, తహసీల్దార్ శంకరబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, డీటీ నాగుల్‌మీరా, ఏపీఎం కోట భాస్కరరావు, ఏపీఓ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిశ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమంలా జగనన్న సురక్ష

నందిగామటౌన్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంలా సాగుతోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నందిగామ పట్టణంలోని సచివాలయం-2, మండలంలోని అంబారుపేట గ్రామ సచివాలయ ఆవరణలో అధికారులు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించటంతో పాటు నెల, రెండు నెలల సమయం పట్టే సర్టిఫికెట్‌లను సైతం అక్కడికక్కడే పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపటంతో పాటు అర్హత ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి పథకాలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తోందని చెప్పారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు షేక్ ఖాలిక్, మారం అమరయ్య, యాకుబ్ అలీ, నాయకులు నల్లమల్లి మురళి, జాఫర్, పలువురు నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అంబారుపేటలో చంటిబిడ్డతో వచ్చి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్ తీసుకుంటున్న మహిళ

ఘనంగా వంగవీటి రంగా జయంతి

నివాళులర్పించిన ఎమ్మెల్యేలు ఉదయభాను, జగన్‌మోహనరావు

నందిగామటౌన్: వంగవీటి మోహన రంగా పేద బడుగు, బలహీన వర్గాలకు ఏ ఆపద వచ్చినా నేనున్నానని ముందుకు వచ్చే మహోన్నత వ్యక్తి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. పట్టణ పరిధిలోని అనాసాగరంలో వీఎం రంగా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని రంగా విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగా ఒక కులానికో, వర్గానికో చెందిన నాయకుడు కాదని అన్ని వర్గాలకు చెందిన ప్రజానాయకుడని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కరి రవీంద్ర, నెలకుదిటి శివనాగేశ్వరరావు, సింగంశెట్టి మల్లికార్జునరావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగా వ్యక్తి కాదు మహాశక్తి : ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: తెలుగు జాతి గర్వించే నేత దివంగత వంగవీటి రంగా అని, ఆయన ఆశయాల సాధనలో ముందుకు సాగుదామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. రంగా జయంతి వేడుకలు పట్టణంలో మంగళవారం స్థానిక రంగా అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ రోడ్డులోని రంగా చౌక్‌లో ఉన్న రంగా విగ్రహానికి ఉదయభానుతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా రంగా అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషిచేసిన రంగాను ఆదర్శంగా తీసుకొని నేటి యువత పనిచేయాలన్నారు. రంగా ఒక కులానికో, ప్రాంతానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉదయభాను ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రంగా అభిమానులతో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే రంగా జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, రంగా అభిమానులు పాల్గొన్నారు.



పేటలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, రంగా అభిమానులు



నందిగామలో వీఎం రంగాకు నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కంచికచర్లలో రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన రాధా రంగా మిత్రమండలి సభ్యులు

ప్రజల గుండెల్లో నిలిచిన వంగవీటి రంగా

కంచికచర్ల:స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో రాధారంగ మిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి, రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు ఉప్పు స్వామి, దేవిరెడ్డి శ్రీనివాసరావు, దాసరి రాజా, గ్రంధి ప్రసాద్, బచ్చు వెంకటేశ్వరరావు, చాపా సత్యనారాయణ, శ్రీనివాసరావు, నంబూరు మాధవ్, తుపాకుల రవి, కొత్తా శ్రీనివాసరావు, సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తపై కేసు

వీరులపాడు: మహిళ బలవన్మరణానికి కారకుడైన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహాలక్ష్మ ణుడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల రెండున మండలంలోని కొణతాలపల్లి గ్రామానికి చెందిన రాయబారపు మౌనిక ఆత్మహత్యకు కారణాలను వివరించారు. మౌనిక భర్త ఏసోబు నిత్యం మద్యం తాగి భార్యను అనుమానించటంతో పాటు శారీరకంగా, మానసికంగా వేధించేవాడని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. అంతే కాకుండా నువ్వు మృతి చెందితే పిల్లలు, తాను సంతోషంగా ఉంటామని అనటంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఏసోబుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

నందిగామ(చందర్లపాడు): మిరప నారు పెంచే నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి నీలిమ సూచించారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు ప్రాంతంలో ఏర్పాటుచేసిన షెడ్ నెట్ నర్సరీలను మంగళవారం ఆమె పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్‌నెట్ నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు. షెడ్ నెట్ నర్సరీల బెడ్ల పక్కన నీలి, పసుపు రంగు జిగురు పూసిన అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి మంగళంపల్లి జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి వేడుకలను ఈ నెల 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం శివరామక్షేత్రంలో కస్తూరి గోపాలరావు గాత్ర కచేరి నిర్వహిస్తున్నట్లు రామసరసి ప్రధానకార్యదర్శి డాక్టర్ సీఎల్‌వీ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వరఝురి ఆధ్వర్యంలో 7వ తేదీ సాయంత్రం గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై రాత్రి 7 గంటలకు బాలమురళీకృష్ణ శిష్యులు డీవీ మోహనకృష్ణతో గురు శిష్య సంబంధం- మురళితో అనుబంధం అంశంగా ఇష్టాగోష్టి ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ ఉదయభాను



నందిగామలో డప్పు వాయిద్యాల నడుమ అల్లూరి సీతారామరాజు చిత్రపటం ఊరేగింపు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అల్లూరి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, జల్లి కారల్‌మార్క్స్, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, ఉపాధ్యాయులు వేముల భిక్షమయ్య, షేక్ ఇస్మాయేలు, సింగిరాజు, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన్యం వీరుడు అల్లూరి జయంతి

నందిగామ: బళ్లారి రాఘవ కళా సమితి ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి చిత్రపటాన్ని పట్టణంలోని పలు ప్రధాన వీధులలో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బళ్లారి రాఘవ కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బబ్బెల్లపాటి గోపాలకృష్ణ సాయి తదితరులు మాట్లాడుతూ అల్లూరి త్యాగనిరతిని కొనియాడారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎ.రవీంద్రరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి దేశభక్తి ఆదర్శనీయం

పెనుగంచిప్రోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి ఆదర్శనీయమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి తహసీల్దార్ చిన్నారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతకోటి త్రివేణి నాయుడు, ఎంపీడీవో ప్రసాద్, కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ ఎడ్యుకేషన్‌పై టీచర్లకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: డిజిటల్ ఎడ్యుకేషన్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు మండలంలోని కేతనకొండ ఆర్కే, జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణలో ఇబ్రహీంపట్నం, నందిగామ మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్పీ) డిజిటల్ తరగతులపై కళాశాలల అధ్యాపకులు శిక్షణ ఇచ్చారు. నాడు - నేడు మొదటి విడత పూర్తయిన పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ట్యాబ్‌లు, ఐఎఫ్పీ సాంకేతిక పరికరాలు అందజేశారు. కోర్స్ డైరెక్టర్లుగా ఎంఈవోలు సీహెచ్ పుష్పలత, శ్యామ్‌బాబు, నరసింహారావు వ్యవహరించారు. యాక్టీవ్ సపోర్టివ్ టీచర్‌గా ఇర్ఫాన్ పఠాన్, కృపావతి,డి.నాగేశ్వరావు,నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ బీసీ-బీగా కులధ్రువీకరణ పత్రాలివ్వాలి

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ ప్రజలకు 'విశ్వబ్రాహ్మణ బీసీ-బీ'గా కుల ధ్రువీకరణ పత్రంలో పేర్కొనాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం విజయవాడలోని ఏపీ బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.శంకర్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లోని విశ్వబ్రాహ్మణులు కంసాలి, వడ్ల, ఆచారి, కమ్మర, అంసుల ఇలా పలు పేర్లతో పిలుస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో అదే పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ గెజిట్‌లో కుల ధ్రువీకరణ పత్రంలో ఒక్క విశ్వబ్రాహ్మణ బీసీ-బీ, సీరియల్ నెంబర్ 21 అని మాత్రమే ఉండేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని గతంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని, దానిని పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన జస్టిస్ శంకర్ నారాయణ కమిషన్ సభ్యులతో చర్చించి చర్యలు చేపడతామని అన్నట్లు శ్రీకాంత్ చెప్పారు.



జస్టిస్ శంకర్ నారాయణకు వినతి పత్రం ఇస్తున్న శ్రీకాంత్

శాంతి కల్యాణంతో ముగిసిన పవిత్రోత్సవాలు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రాంగణంలోని కల్యాణ మండపంపై అర్చకులు వేదాంతం వెంకట శేషాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు కల్యాణ క్రతువు జరిపించి పవిత్రోత్సవాలు ముగించారు. కార్యక్రమంలో ఈవో హేమలతా దేవి, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.